క్లుప్తంగా

శ్రమదానంతో కాలిబాట అభివృద్ధి



కాలిబాట ఏర్పాటు చేసుకుంటున్న నేరేడుబంద గ్రామస్తులు

రావికమతం: తమ పిల్లలు రోజూ స్కూల్‌కు వెళ్లి వచ్చే కాలిబాటను నేరేడుబంద గ్రామస్తులు శ్రమదానంతో ఆదివారం చిన్నరోడ్డుగా మార్చుకున్నారు. చీమలపాడు పంచాయతీకి దూరంగా కొండలపై నేరేడుబంద గ్రామం ఉంది. అక్కడ 12 గిరిజన కుటుంబాలు ఉంటున్నాయి. 15 మంది పిల్లలు జెడ్.జోగింపేట స్కూల్‌కు వెళ్లి వస్తుంటారు. ఈ క్రమంలో తుప్పలు, రాళ్లతో నిండిన దారిని బాగుచేసుకోవాలని సంకల్పించిన గ్రామస్తులు పిల్లా పాపలతో కలిసి శ్రమించారు. కాలిబాటను చిన్నపాటి రహదారిగా మార్చుకున్నారు. ప్రభుత్వం నిధులు మంజూరు చేసి సీసీరోడ్డుగా అభివృద్ధి చేయాలని గ్రామస్తులు కిల్లో పొట్టి దొర, డిప్పల అప్పారావు, కిల్ల సూరిబాబు కోరుతున్నారు. గతంలో కలెక్టర్‌కు స్పందనలో దరఖాస్తు చేశామన్నారు.

పేదలకు రోటరీ క్లబ్ చేయూత



దివ్యాంగులకు వీల్ చైర్లు అందజేస్తున్న క్లబ్ ప్రతినిధులు

నర్సీపట్నం: స్థానిక రోటరీ క్లబ్ కార్యాలయంలో ఆదివారం పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. ఐదుగురు దివ్యాంగులకు వీల్ చైర్లు, ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థినులకు 28 సైకిళ్లు, స్వయం ఉపాధి నిమిత్తం మహిళలకు 26 కుట్టు మిషన్లు పంపిణీ చేశారు. రోటరీ క్లబ్‌కు బిల్డింగ్ విరాళంగా అందజేసిన లక్ష్మణ్‌మూర్తి కుమారులను క్లబ్ ప్రతినిధులు సత్కరించారు. ముున్ముందు మరిన్ని సేవా కార్యక్రమాలు నిర్వహిస్తామని క్లబ్ అధ్యక్ష, కార్యదర్శి అప్పలరాజు, జంపన నాగేంద్రరాజు పేర్కొన్నారు. అసిస్టెంట్ గవర్నర్ పచ్చిగోళ్ల నారాయణరావు తదితర్లు పాల్గొన్నారు.

800 మంది పేదలకు దుప్పట్ల పంపిణీ



దుప్పట్లు అందిస్తున్న ట్రస్ట్ వ్యవస్థాపకులు భాస్కర్, నాగమణి

కె.కోటపాడు: సామాజిక బాధ్యతతో సేవా కార్యక్రమాలు చేపడుతున్నట్లు కుంభం రామలింగం పిళ్లై ట్రస్ట్ వ్యవస్థాపకులు భాస్కర్, నాగమణి తెలిపారు. ఎ.కోడూరు, పొడుగుపాలెం, ఆర్.వై.అగ్రహారం, కె.జె.పురం, సూర్రెడ్డిపాలెం గ్రామాల్లో 800 మంది పేదలకు ఆదివారం దుప్పట్లను పంపిణీ చేశారు. ప్రతి ఒక్కరూ తోటి మనిషికి సహాయ పడాలని దాతలు కోరారు. ఎ.కోడూరు సర్పంచ్ బొడ్డు అక్కునాయుడు పాల్గొన్నారు.

నిరుపేద దేవాంగులకు సంక్రాంతి కానుకలు



సంక్రాంతి కానుకలు అందజేస్తున్న దేవాంగుల సంక్షేమ సంఘ సభ్యులు

దేవరాపల్లి: సీఎంఆర్ గ్రూపు సంస్థల అధినేత మావూరి వెంకటరమణ దాతృత్వంతో నిరుపేద దేవాంగ కుటుంబాలకు సంక్రాంతి కానుకలు పంపిణీ చేస్తున్నట్లు ఆ సంఘం ప్రధాన కార్యదర్శి బి. సత్యనారాయణ, ఉపాధ్యక్షులు ఎన్. సత్యన్నారాయణమూర్తి, కాకర్ల రాజారావు తెలిపారు. ఆదివారం దేవరాపల్లి, కశింకోట మండలాల్లో 70 పేద కుటుంబాలకు నిత్యావసర సరుకులు, చీరలు పంపిణీ చేశామన్నారు. ఈ ఏడాది ఇంటర్ నుంచి బీటెక్ చదివే విద్యార్థులకు రూ.10 వేల చొప్పున మెరిట్ స్కాలర్‌షిప్ అందజేస్తామన్నారు. సంఘం కోశాధికారి సుదర్శనరావు, సంయుక్త కార్యదర్శి బాపూజీ, నిరంజన్, స్థానిక సంఘ సభ్యులు కె. సత్యారావు, అల్లాడ సన్యాసిరావు, కాలెపు సన్యాశిరాజు తదితర్లు పాల్గొన్నారు.

లింక్ రోడ్లకు రూపురేఖలు

- మాడుగుల నియోజకవర్గంలో రూ. 40 కోట్లతో 35 బీటీరహదారులు
- 70 కిలోమీటర్ల మేర తారురోడ్లుగా రూపాంతరం
- వేగవంతంగా నిర్మాణాలు

దేవరాపల్లి: మాడుగుల నియోజకవర్గంలో లింక్ రోడ్ల రూపు రేఖలు మారుతున్నాయి. గత పాలకులు ఈ రోడ్ల వైపు కనీసం కన్నెత్తి చూడకపోవడంతో ఛిద్రంగా మారాయి. ఈ నేపథ్యంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత వీటిపై ప్రత్యేక దృష్టి సారించింది. రూ. 40 కోట్లతో 70 కిలోమీటర్ల మేర మైదాన, గిరిజన 35 గ్రామాల మధ్య లింక్ రోడ్లు (తారు రోడ్లు)ను పక్కా నాణ్యతా ప్రమాణాలతో వేగవంతంగా నిర్మిస్తున్నారు. వీటిలో కొన్ని పూర్తి కాగా, మరికొన్ని వివిధ దశల్లో నిర్మాణంలో ఉన్నాయి.

దేవరాపల్లి మండలంలో 15 రోడ్ల నిర్మాణం....

చినసోంపురం నుంచి తామరబ్బకు రూ. 1.51 కోట్లతో 3.14 కి.మీ మేర తారురోడ్డు నిర్మించారు. చినగంగవరం నుంచి చింతలపాలెంకు రూ. 1.53 కోట్లతో 3 కిలోమీటర్లు, గరిశింగి నుంచి డొర్రి చెరువుకు రూ.1.12 కోట్లతో 2.3 కి.మీ, తారువ నుంచి ఎం. అలమండకు రూ.1.12 కోట్లతో 3.6 కి.మీ, తెనుగుపూడి శివారు విస్సారపు వీధికి రూ. 43 లక్షలతో 900 మీటర్ల మేర బీటీరోడ్లు పూర్తి చేశారు. దేవరాపల్లి విద్యుత్ సబ్‌స్టేషన్ పక్క నుంచి మారేపల్లికి రూ. 1.52 కోట్లతో 2.68 కి.మీ, దేవరాపల్లి నుంచి చిననందిపల్లికి రూ. 2.12 కోట్లతో 3.6 కి.మీ, దేవరాపల్లిలోని ఒడ్డు చింతాల కల్లాలకు రూ. 72 లక్షలతో 1.2 కి.మీ మేర, చిననందిపల్లి నుంచి చేనులపాలెంకు రూ.82 లక్షలతో 1.7 కిలోమీటర్లు, కలిగొట్లలో బందారుపాలెంకు రూ. 90 లక్షలతో కి.మీ మేర తారు రోడ్లు నిర్మిస్తున్నారు. కొత్తపెంట నుంచి ఎన్.జి. నగరంకు రూ.1.18 కోట్లతో 1.6 కి.మీ, ఏ.కొత్తపల్లి నుంచి నూకాలమ్మ కాలనీకి రూ. 1.18 కోట్లతో 1.1 కి.మీ మేర తారురోడ్లు నిర్మిస్తున్నారు. బి. కింతాడ నుంచి చుక్కపల్లికి రూ. 1.76 కోట్లతో 3 కి.మీ మేర, దేవరాపల్లి, చిననందిపల్లి పీఆర్ రోడ్డు నుంచి చేనులపాలెంకు రూ. 1.21 కోట్లుతో 2.18 కి.మీ మేర తారురోడ్డు నిర్మిస్తున్నారు. పెదనందిపల్లి సత్యన్నారాయణపురం కాలనీ నుంచి చేనులపాలెం వరకు రూ. 1.75 కోట్లతో 2.2 కి.మీ మేర తారురోడ్డు నిర్మాణ పనులు జరుగుతున్నాయి.



అద్దంలా దర్శనమిస్తున్న దేవరాపల్లి-మారేపల్లి తారు రోడ్డు నిర్మాణం (నేడు)



దేవరాపల్లి-మారేపల్లి రహదారి దుస్థితి(నాడు)

మాడుగుల నియోజకవర్గంలో నిర్మించిన తారు రోడ్ల వివరాలు...

మండలం	రోడ్ల సంఖ్య	నిధులు(కోట్లలో)	కి.మీ
మాడుగుల	6	6.89	13
దేవరాపలి	15	18.87	33.04
కె.కోటపాడు	6	6.23	11
చీడికాడ	6	8.50	13.13

బురదలో వెళ్లేవారం



మారేపల్లి నుంచి దేవరాపల్లి విద్యుత్ సబ్ స్టేషన్‌కు తారురోడ్డు చూస్తానని అనుకోలేదు. ఈ రోడ్డుతో దేవరాపల్లికి చేరుకునేందుకు సగం మేర దూరం తగ్గుతుంది. గతంలో మోకాళ్ల లోతు బురదలో నడిచి వెళ్లి నరకయాతన అనుభవించేవారం. పంట ఉత్పత్తులను ఇంటికి తెచ్చుకోలేని పరిస్థితి ఉండేది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మా కష్టాలు తొలగాయి.

– దొగ్గ దేముడు, మారేపల్లి గ్రామం, దేవరాపల్లి మండలం

ఆలయాల్లో కె.జె.పురం మహిళల కోలాటం



సింహాచలం దేవస్థానం వద్ద కోలాటం సభ్యులు

మాడుగుల రూరల్: కె.జె.పురం గ్రామానికి చెందిన వెంకట జగన్నాథ కోలాటం గ్రూపు సభ్యులు ఆదివారం విశాఖలోని ఆలయాల్లో కోలాటం ప్రదర్శించారు. సింహాచలం దేవస్థానం ఆవరణలో 30 మంది సభ్యులు భక్తిగీతాలు ఆలపిస్తూ కోలాటం నిర్వహించారు. రుషికొండ సమీపంలో వేంకటేశ్వరస్వామి, కనకమహాలక్ష్మి ఆలయాల్లోనూ కోలాటం ప్రదర్శించి ఆకట్టుకున్నారు. ఈ కోలాటం గ్రూపునకు కాళ్ల మాధవి టీమ్ లీడర్‌గా వ్యవహరించారు.

విద్యార్థుల్లో పోటీతత్వానికి పజిల్ గేమ్



పజిల్ గేమ్‌లో పాల్గొన్న విద్యార్థులు

నర్సీపట్నం: విద్యార్థుల్లో పోటీతత్వాన్ని పెంచేందుకు ప్రతి వారం పజిల్ గేమ్ నిర్వహిస్తున్నామని గ్రంథాలయ అధికారి పి.ధమయంతి పేర్కొన్నారు. స్థానిక శాఖా గ్రంథాలయంలో చిల్డ్రన్స్ క్లబ్ సందర్భాన్ని పురస్కరించుకుని ఆదివారం పజిల్ గేమ్ నిర్వహించారు. ఇద్దరు విద్యార్థులు గ్రంథాలయంలో సభ్యులుగా చేరారు. విద్యార్థుల్లో పఠనాశక్తి పెంచే ప్రయత్నంలో భాగంగా ఇలాంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. లైబ్రేరియన్ రాజుబాబు పాల్గొన్నారు.

ప్రజల మేలు కోరే సీఎం జగన్

- గడప గడపకు కార్యక్రమంలో డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు

కె.కోటపాడు: రాష్ట్రంలో ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపర్చేందుకు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చిత్తశుద్ధితో పాలన అందిస్తున్నారని డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు అన్నారు. చౌడువాడ-2 గ్రామ సచివాలయం పరిధిలోని పాచిలవానిపాలెం, బంటువారి కళ్లాలు, గరుగుబిల్లి గ్రామాల్లో ఆదివారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాచిలవానిపాలెంలో ఒక్క సమస్య లేకుండా అభివృద్ధికి పూర్తిస్థాయిలో సహకారం అందించనున్నట్లు పేర్కొన్నారు. ఒకే మాటపై ఉండే గ్రామాన్ని ఎల్లప్పుడూ అభిమానిస్తానన్నారు. గ్రామంలో జలజీవన్ మిషన్ నుంచి రూ.36 లక్షలతో మంచినీటి పథకంతోపాటు ఇంటింటి కుళాయిల ఏర్పాటు, రూ.25 లక్షలతో సీసీరోడ్లు, డ్రైనేజీ పనులను పూర్తి చేయించినట్లు తెలిపారు. ఇకపైనా గ్రామాభివృద్ధికి నిధులు మంజూరు చేస్తానని హామీ ఇచ్చారు. ఈ క్రమంలో రూ.1.79 లక్షల సంక్షేమ లబ్ధి కలిగిందని గండి సన్నిబాబు ఆనందం వ్యక్తం చేశాడు. అనంతరం బంటువారి కళ్లాల వద్ద సీసీరోడ్ల నిర్మాణానికి నిధులు మంజూరు చేయనున్నట్లు డిప్యూటీ సీఎం తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ రెడ్డి జగన్‌మోహన్, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ అల్లు సూర్యనారాయణ, ఎంపీడీవో శచీదేవి, వైస్ ఎంపీపీ రొంగలి సూర్యనారాయణ, పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి దాట్ల శివాజీరాజు, ఎంపీటీసీ ఏటుకూరి రాజేష్, ఆకుల సాయి ప్రసాద్, రాజి శ్రీనివాసరావు, వారాది అప్పారావు, డెయిరీ డైరెక్టర్ సుందరపు గంగాధర్, రొంగలి రమేష్, చల్లా సురేష్, గండి సత్యం, బంటు జలంధర్, రమేష్, వేచలపు దొరబాబు, లెక్కల గోపి, బండారు ముత్యాలనాయుడు, ఆది రెడ్డి రామునాయుడు, బండారు రామస్వామిపాత్రుడు పాల్గొన్నారు.

చినగంగవరంలో గడప గడపకు నేడు

దేవరాపల్లి: గరిశింగి గ్రామ సచివాలయం పరిధిలోని చిన గంగవరం, రేగులబంద, సంతపాలెం, వేలంబయలు, చింతలపాలెం గ్రామాల్లో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు సోమవారం నిర్వహిస్తారని వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు బూరె బాబూరావు తెలిపారు. ఎంపీపీ కిలపర్తి రాజేశ్వరి, జెడ్పీటీసీ కర్రి సత్యం పాల్గొంటారని, పార్టీ శ్రేణులు విజయవంతం చేయాలని కోరారు.



కె.కోటపాడు: పాచిలవానిపాలెంలో సంక్షేమ లబ్ధిని వివరిస్తున్న డిప్యూటీ సీఎం ముత్యాలనాయుడు



నాతవరం: డ్వాక్రా మహిళలకు రుణ నమూనా చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే గణేష్

ఇంకా పథకాలందని అర్హులుంటే చెప్పండి : ఎమ్మెల్యే ఉమాశంకర్ గణేష్

నాతవరం: అర్హులకు ఇంకా సంక్షేమ పథకాలు అందకపోతే తన దృష్టికి తీసుకొస్తే అందిస్తామని ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ తెలిపారు. నాతవరం గ్రామ సచివాలయ -2లో గడప గడపకు మన ప్రభుత్వ కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు ఏవిధంగా అందుతున్నాయని లబ్ధిదారులను అడిగి తెలుసుకున్నారు. అధికంగా ఇళ్లు, ఇళ్ల స్థలాలు, ఇంటింటి కుళాయిలు కల్పించాలని ప్రజలు ఎమ్మెల్యేను కోరారు. తన దృష్టికి తీసుకొచ్చిన సమస్యలను పరిష్కరిస్తానన్నారు. ఈ ఏడాది మండలంలో డ్వాక్రా సంఘాలకు బ్యాంకు లింకేజ్, స్త్రీనిధి ద్వారా రూ.40 కోట్ల వరకు రుణాలు ఇచ్చేందుకు లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. అర్హత ఉన్న ప్రతి డ్వాక్రా గ్రూపునకు రూ.10 లక్షల రుణం ఇస్తున్నామన్నారు. డిసెంబర్‌లో రూ.5 కోట్ల వరకు రుణాలు ఇచ్చామన్నారు. అనంతరం డ్వాక్రా సంఘ సభ్యులకు నమూనా చెక్కు అందజేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ కాపారపు అప్పలనర్స, వైస్ ఎంపీపీలు పైల సునీల్, మైనం నాగగోపి, వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు పైల పోతురాజు, తహసీల్దార్ కనకారావు, ఎంపీడీవో యాదగిరీశ్వరరావు, స్థానిక ఎంపీటీసీలు, చెక్కా ప్రభావతి, కరక రేణుక, సర్పంచ్ గొలగాన రాణి, ఉప సర్పంచ్ కరక అప్పలరాజు, మండల వ్యవసాయశాఖ సలహా మండలి చైర్మన్ శెట్టి నూకరాజు, ఎస్సీ సెల్ కమిటీ సభ్యుడు చెక్కా జోగిరాజు, మాజీ సర్పంచ్ లంక రాంబాబు, వెలుగు ఏపీఎం మర్రి లక్ష్మి పాల్గొన్నారు.

నేడు కందిపూడిలో..

బుచ్చెయ్యపేట: కందిపూడిలో సోమవారం గడప గడపకు మన ప్రభుత్వ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు కె. అచ్చింనాయుడు తెలిపారు. ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ ఇంటింటికీ తిరిగి ప్రభుత్వ పథకాలు సంక్రమంగా అందుతున్నదిలేనిది పరిశీలిస్తారని, అన్ని గ్రామాల నాయకులు, అధికారులు పాల్గొనాలని కోరారు.

డిప్యూటీ సీఎంను కలిసిన పబ్లిక్ ప్రాసిక్యూటర్



డిప్యూటీ సీఎం బూడికి పుష్పగుచ్ఛం అందిస్తున్న పబ్లిక్ ప్రాసిక్యూటర్ జగదీశ్వరరావు

దేవరాపల్లి: డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడును ఉమ్మడి విశాఖ జిల్లా న్యాయస్థానం పబ్లిక్ ప్రాసిక్యూటర్ కాండ్రేగుల జగదీశ్వరరావు ఆదివారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ మేరకు తారువ క్యాంప్ కార్యాలయంలో కలిసి పుష్పగుచ్ఛం అందజేసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు.

వేగవంతంగా కాగిత గ్రామ బీటీరోడ్డు

మాడుగుల: మండలంలోని గిరిజన గ్రామం కాగిత బీటీరోడ్డు శరవేగంగా నిర్మిస్తున్నారు. గతంలో సరైన రహదారి సౌకర్యం లేక నానా అవస్థలు పడేవారమని, వర్షాలు అధికమైతే కొండగెడ్డలు వల్ల ఇబ్బందులు పడేవారని కాగిత, పెదసారాడ, చిన సారాడ, గిరిజన గ్రామాలకు చెందిన ఓల్లపు శ్రీను, ఉగ్గిన ఈశ్వరరావు వాపోయారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత శరబన్నపురం నుంచి కాగిత మీదుగా చిన సారాడ, పెదసారాడ మీదుగా వంతెనలతోపాటు రోడ్డు పనులకు రూ.1.80 కోట్లు మంజూరయ్యాయి. ఈ మొత్తంతో చేస్తుండటంతో చిన సారాడ గ్రామానికి చెందిన అంపరింగి శ్రీను, ఒలిపిరి రాజబాబు ఆనందం వ్యక్తం చేశారు. ఈ పనులు సర్పంచ్ కిముడు మోహహైందవి, గుప్తేశ్వరి, మాజీ సర్పంచ్‌లు కిముడు కోటి, గదబర కళ్యాణం, ఎంపీటీసీ చదర కృష్ణమ్మదొర, వైఎస్సార్ సీపీ నాయకులు బన్ని, జుత్తాడ ఎర్రయ్య పరిశీలించారు.



రోడ్డు పనులు పరిశీలిస్తున్న సర్పంచ్ మోదహైందవి, మాజీ సర్పంచ్ కోటి

కొత్త పింఛన్‌దారుల్లో ఆనందం

రోలుగుంట: రత్నంపేట గ్రామ సచివాలయంలో ఎంపీపీ యర్రంశెట్టి శ్రీనివాసరావు, మాజీ సర్పంచ్ తమటపు సత్యంనాయుడు ఆదివారం లబ్ధిదారులకు పింఛన్లు పంపిణీ చేశారు. ఇక్కడ సచివాలయ పరిధిలో 27 మందికి కొత్తగా పింఛన్లు మంజూరయ్యాయి. గత ప్రభుత్వంలో కాళ్లరిగేలా తిరిగేవారమని, వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో వలంటీర్లే తమ వద్దకు వచ్చి వివరాలు తీసుకుని పింఛన్లు మంజూరు చేయడం ఆనందంగా ఉందని లబ్ధిదారులు తెలిపారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి, ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీలకు కృతజ్ఞతలు తెలిపారు.



పింఛను అందజేస్తున్న ఎంపీపీ శ్రీనివాసరావు

గ్రామాల్లో భక్తిశ్రద్ధలతో మేలుకొలుపులు

మాడుగుల/రోలుగుంట/గొలుగొండ: ధనుర్మాస ఉత్సవాల్లో భాగంగా గ్రామాల్లో మేలుకొలుపులు నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా రోజూ తెల్లవారుజాము నుంచే సీతారాముల ఉత్సవ విగ్రహాలను వీధుల్లో ఊరేగిస్తూ సంకీర్తనలు ఆలపిస్తూ తిరిగి ఆలయాలకు చేరుకుంటున్నారు. రోలుగుంటలోని మేలుకొల్పుల కార్యక్రమంలో చిన్నారులు సైతం పాల్గొన్నారు. విష్ణుమూర్తిని మేలకొలుపేందుకు ఆలపించిన భక్తి గీతాలు గ్రామస్తులను ఆకట్టుకున్నాయి. గొలుగొండ మండలం పుత్తడిగైరంపేటలో ఈ కార్యక్రమం నిర్వహించారు.



రోలుగుంటలో భక్తి గీతాలు ఆలపిస్తున్న చిన్నారులు

రూ.1.40 కోట్లతో చెట్టుపల్లి - పెదగోగాడ బీటీరోడ్డు

చీడికాడ: డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు కృషితో గ్రామీణ రోడ్లను అభివృద్ధి చేస్తున్నామని ఎంపీపీ కురచా జయమ్మ తెలిపారు. చెట్టుపల్లి చెరకు కాటా నుంచి పెదగోగాడ ఆర్‌అండ్‌బీ రోడ్డు వరకు బీటీరోడ్డు నిర్మాణ పనులకు ఆదివారం ఆమె భూమిపూజ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 2.7 కిలోమీటర్ల మేర ఈ రోడ్డుకు రూ.1.40 కోట్లు కేటాయించారన్నారు. చెట్టుపల్లి నుంచి అర్జునగిరి వరకు కిలోమీటరు మేర మట్టిరోడ్డును రూ. 90 లక్షలతో తారురోడ్డుగా నిర్మించేందుకు నిధులు మంజూరు చేశారన్నారు. జెడ్పీటీసీ లాలం శారదా జానకీరాం, వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు గొల్లవిల్లి రాజుబాబు, పార్టీ యువజన విభాగం అధ్యక్షుడు గొల్లవిల్లి స్వామినాయుడు, చెట్టుపల్లి, చుక్కపల్లి గ్రామాల నాయకులు పాతాళం చిన్నంనాయుడు, పాతాళం శ్రీను, తుంపాల శ్రీను, సుంకర తిరమలరావు, బాయిశెట్టి వెంకటరమణ పాల్గొన్నారు.



రోడ్డు పనులను ప్రారంభిస్తున్న ఎంపీపీ కురచా జయమ్మ తదితరులు

నేడు గర్భిణులకు ఆరోగ్య పరీక్షలు

మాడుగుల రూరల్: మండలంలోని కె.జె.పురం, కింతలి పీహెచ్‌సీల్లో సోమవారం గర్భిణులకు ప్రత్యేక ఆరోగ్య పరీక్షలు నిర్వహిస్తున్నట్లు వైద్యాధికారులు ప్రసాదుపాత్రుడు, కె.ఎం.నాయుడు ఆదివారం తెలిపారు. ప్రధానమంత్రి ఆరోగ్య సురక్షిత అభియాన్ యోజనలో భాగంగా ప్రతి నెలా 9న పీహెచ్‌సీల్లో గర్భిణులకు అన్ని రకాల పరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులు పంపిణీతోపాటు హైరిస్కు కేసులను సమీప ఏరియా ఆస్పత్రికి రిఫర్ చేస్తున్నామన్నారు.

డైరీని ఆవిష్కరించిన ఎమ్మెల్యే గణేష్



పద్మశాలి అసోసియేషన్ ప్రతినిధులతో కలిసి డైరీని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే గణేష్

నర్సీపట్నం: పద్మశాలి ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ డైరీని ఆదివారం స్థానిక క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ ఆవిష్కరించారు. పద్మశాలి సంఘం ఏ కార్యక్రమం తలపెట్టినా తనవంతు సహాయ సహకారాలు ఎప్పుడు ఉంటాయని ఆయన హామీ ఇచ్చారు. జిల్లా అధ్యక్షుడు జోగిరాజు, నర్సీపట్నం శాఖ అధ్యక్షుడు సూరిశెట్టి సూర్యనారాయణమూర్తి, గౌరవాధ్యక్షుడు వంకల మహేశ్వరరావు, పూర్వ అధ్యక్షుడు తేలు నాగరాజు, కోసూరు రామకృష్ణ, నాగేశ్వరరావు, వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

పీవీ చలపతిరావుకు ఘన నివాళి



చలపతిరావు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

నర్సీపట్నం: స్థానిక ప్రైవేట్ లాడ్జిలో బీజేపీ సీనియర్ నాయకుడు దివంగత పి.వి.చలపతిరావు సంతాప సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఉద్యమ నాయకుడు రుత్తల యర్రాపాత్రుడు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మీసాల సుబ్బన్న, డాక్టర్ రామచంద్రరాజు, బీజేపీ జిల్లా మాజీ అధ్యక్షుడు పొన్నగంటి అప్పారావు, రాష్ట్ర నాయకుడు గాదె శ్రీనివాసరావు, అసెంబ్లీ కన్వీనర్ కాళ్ల సుబ్బారావు ఘన నివాళులర్పించారు. నర్సీపట్నం జెడ్పీటీసీ సుకల రమణమ్మ, ఎర్రినాయుడు, పృథ్వీరాజు, గవిరెడ్డి త్రినాథ్ పాల్గొన్నారు.

క్రీడలతో మానసిక ఉల్లాసం

నాతవరం: క్రీడలతో మానసికోల్లాసం కలుగుతుందని ఎస్సై డి.లక్ష్మీనారాయణ తెలిపారు. సంక్రాంతి పండగ సందర్భంగా ఆదివారం నాతవరంలో వాలీబాల్, క్రికెట్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీలను ఎస్సై ప్రారంభించి, క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చదువుతో పాటు ఆటల పోటీలు కీలకమన్నారు. ఈ పోటీలకు పోలీసు శాఖ తరఫున సహాయ సహకారాలు అందిస్తామన్నారు. పోటీల నిర్వాహకులు మాట్లాడుతూ క్రికెట్‌లో ప్రథమ, ద్వితీయ బహుమతులుగా రూ.15 వేలు, రూ.10 వేలు, వాలీబాల్‌లో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచిన జట్లకు రూ. 10 వేలు, రూ.8 వేలు, రూ.6 చొప్పున ప్రదానం చేస్తామన్నారు. ఈ పోటీల్లో పాల్గొన్న క్రీడాకారులకు జ్ఞాపికలు, సర్టిఫికెట్లు అందజేస్తామన్నారు. మాజీ ఎంపీపీ నేతల విజయ్‌కుమార్, పారుపల్లి కొండబాబు, వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు పైల పోతురాజు, మాజీ సర్పంచ్ సామిరెడ్డి కృష్ణయ్య, మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ సీతారామమూర్తి పాల్గొన్నారు.



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న ఎస్సై లక్ష్మీనారాయణ

శరవేగంగా సిమెంట్ కాంక్రీట్ పనులు

దేవరాపల్లి: స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్ ఆవరణలో సిమెంట్ కాంక్రీట్ పనులను శరవేగంగా చేస్తున్నారు. ఈ పనులను మాజీ ఎంపీపీ కిలపర్తి భాస్కరరావు ఆదివారం పరిశీలించారు. నాయకులు పాల్గొన్నారు.